సాక్షి
చిత్తూరు

ఆదివారం । 2 । మార్చి । 2025



ట్రాఫిక్ 'పరీక్ష'
ఇంటర్ విద్యార్థులకు సీఎం పర్యటన చుక్కలు చూపించింది. పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి అష్టకష్టాలు పడ్డారు. - 8లో



ఆయన హెచ్ఎం.. ఆమె పెత్తనం
పలమనేరు హెచ్ఎం సతీమణి స్కూల్లో పెత్తనం చెలాయిస్తుండడంతో టీచర్లు ఆందోళన చెందుతున్నారు. - 8లో



ముసుగు దొంగల హల్‌చల్
చిత్తూరు నగరంలోని దుర్గానగర్ కాలనీలో ముసుగు ధరించిన నలుగురు దొంగలు శుక్రవారం అర్ధరాత్రి హల్‌చల్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

హామీలు నెరవేర్చలేక కేసులు



పలమనేరు పీఎస్‌లో సంతకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు : అధికారం ఉంది కదా అని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కూటమి నేతలు పెడుతున్న తప్పుడు కేసులను ప్రజలు గమనిస్తున్నారని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. ఆ మేరకు స్థానిక పీఎస్‌లో షరతులతో కూడిన బెయిల్‌పై శనివారం ఆయన సంతకం చేసి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నేతలతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న కూటమి ప్రభుత్వానికి త్వరలోనే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

ఎస్పీ పేరిట నకిలీ ఫేస్‌బుక్



ఎస్పీ పేరిట నకిలీ ఖాతాలో ప్రత్యక్షమైన పోస్టులు

చిత్తూరు అర్బన్ : సైబర్ మోసగాళ్లు సామాన్యులనే కాదు.. ఐపీఎస్ అధికారులనూ వదలడం లేదు. ఇప్పటి వరకు ఫేస్‌బుక్ (ఎఫ్‌బీ)లో పలువురి నకిలీ ఐడీల ద్వారా ఒరిజినల్ ఫొటోలు పెట్టి ఖాతా ప్రారంభించడం, ఆపై డబ్బులు వసూలు చేయడం చూస్తూనే ఉన్నాం. విషయం తెలుసుకున్న అసలు వ్యక్తి, తన ఖాతా హ్యాక్ అయిందని, ఎవరూ డబ్బులు పంపొద్దని మెసేజ్‌లు పెట్టే వాళ్లు. ఎఫ్‌బీ అకౌంట్ ఉన్న దాదాపు 90 శాతం మందికి ఈ అనుభవం ఎదురయ్యే ఉంటుంది. దీన్ని డిలీట్ చేయడానికి కొందరు పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కినా ప్రయోజనం కనిపించదు. కానీ ప్రస్తుతం చిత్తూరు ఎస్పీ మణికంఠ పేరిట ఫేస్‌బుక్‌లో నకిలీ అకౌంట్ హల్‌చల్ చేస్తోంది. వి.ఎస్.మణికంఠ చందోలు ఐపీఎస్ పేరిట ఉన్న ఈ ఖాతా దాదాపు 2 వేల మంది ఫాలోవర్స్‌ను కలిగి ఉంది. చాలామంది ఎఫ్‌బీ వాడేవాళ్లకు ఎస్పీ పేరిట ఫ్రెండ్ రిక్వెస్టులు వస్తున్నాయి. ఎవరో ఏమిటో తెలుసుకోకుండా ఎస్పీ ఫొటో కనిపిస్తుండడంతో అందరూ రిక్వెస్ట్‌ను యాక్సెప్ట్ చేసేస్తున్నారు. తీరా ఇందులో యువతుల ఫొటోలు, మద్యం బాటిళ్లు, వంటలు ఇలా సంబంధంలేని పోస్టులు దర్శనమిస్తున్నాయి. కొద్దిమంది మాత్రమే దీన్ని చెక్‌చేసుకున్న తరువాత.. ఇది ఎస్పీ ఒరిజినల్ ఖాతా కాదని అన్-ఫ్రెండ్ చేస్తున్నారు. చిత్తూరు సైబర్ పోలీసులు ఇలాంటి నిందితులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని టెకీలు కోరుతున్నారు.

కమనీయం.. ఆదిదంపతుల కల్యాణం

- తరలివచ్చిన భక్తులు
- ఒక్కటైన జంటలు

శ్రీకాళహస్తి: ఆదిదంపతుల కల్యాణం భక్తుల కోలాహలం మధ్య కమనీయంగా సాగింది. శనివారం తెల్లవారు జామున సుమారు 4.30గంటల సమయంలో జ్ఞానప్రసూనాంబదేవికి శ్రీకాళహస్తీశ్వరునిచే మాంగల్యధారణ జరిగింది. ఇదే శుభఘడియల్లో ఆదిదంపతుల సమక్షంలో నూతన జంటలు వివాహం చేసుకుని ఒక్కటయ్యారు. అంతకుముందు శుక్రవారం రాత్రి ఆలయంలోని అలంకార మండపంలో శ్రీకాళహస్తీశ్వరస్వామి, జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని బంగారు ఆభరణాలతో అలంకరించి వేదోక్తంగా పూజలు చేశారు. అనంతరం స్వామివారిని గజ వాహనంపై, అమ్మవారిని సింహ వాహనంపై అదిష్ఠింపజేసి పెండ్లిమండపం వద్దకు వేంచేశారు. పెండ్లి మండపం వద్దకు మొదట పరమేశ్వరుడు చేరుకోగా.. మధ్యలో పార్వతీదేవి అలకబూనడంతో చండికేశ్వరుడు మధ్యవర్తిత్వం చేయడంతో జ్ఞానప్రసూనాంబ అమ్మవారు సంతృప్తి చెంది పెండ్లి మండపం వద్దకు చేరుకున్నారు. అనంతరం వేదపండితులు ఆదిదంపతుల కల్యాణ ఘటన్ని పూర్తిచేశారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి దంపతులు, ఈవో బాపిరెడ్డి పాల్గొన్నారు.

ఆగమోక్తం నటరాజస్వామి కల్యాణం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం రాత్రి సభాపతి కల్యాణం ఆగమోక్తంగా సాగింది. నటరాజ స్వామి, శివకామ సుందరి వివాహాన్ని పురోహితులు వేదోక్తంగా నిర్వహించారు. అనంతరం శివకామసుందరి సమేత నటరాజస్వామి పురవీధుల్లో ఊరేగారు.



పూజలు చేస్తున్న వేదపండితులు



స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పణ



తాళిచూపుతున్న వేదపండితులు

ఒక్కటైన నూతన జంటలు

స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం సందర్భంగా నూతన జంటలు ఏకమయ్యాయి. నూతన వధూవరులకు ముక్కంటి ఆలయం తరపున మంగళ సూత్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, దుస్తులు అందజేశారు. జ్ఞానప్రసూనాంబ దేవికి మాంగల్యధారణ చేసిన సమయంలోనే ఈ జంటలు కూడా మాంగల్యధారణ కార్యక్రమాన్ని పూర్తిచేసి ఒక్కటయ్యారు.

నేడు గిరిప్రదక్షిణ

శనివారం ఉదయం కల్యాణోత్సవం ముగిసింది. కల్యాణానికి వచ్చిన రుషులు, దేవతలను సాగనంపేందుకు శివయ్య ఆదివారం విల్లంబులు ధరించి వారివారి స్థావరాలకు చేర్చనున్నారు. దీన్నే రుషిరాత్రి అని కూడా అంటారు. గిరిప్రదక్షిణ తరువాత పట్టణానికి తిరిగి వచ్చే స్వామి, అమ్మవార్లకు భక్తులు వేలాది ఎదురుసేవ మండపం వద్దకు చేరుకుని స్వాగతం పలకడం ఆనవాయితీ. ఈ మేరకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

రుద్రాక్ష చప్పరాలపై శివయ్య వైభవం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షికోత్సవాలను పురస్కరించుకుని శనివారం ఉదయం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి రుద్రాక్ష చప్పరాపై పురవీధుల్లో ఊరేగారు. ఆదిదంపతుల కల్యాణం ముగిసిన తర్వాత ఉత్సవమూర్తులను ఆలయానికి తీసుకెళ్లారు. ఉదయం 11గంటల సమయంలో వేదోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రుద్రాక్ష చప్పరాలపై అధిష్ఠింపేజేసి పురవీధుల్లో ఊరేగించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 8 గంటలకు : కైలాసగిరి ప్రదక్షిణ వాహన సేవలు
ఉదయం: బనాత అంబారి వాహనసేవ
సాయంత్రం: అశ్వం – సింహ వాహన సేవ
ఉభయదాతలు: బియ్యపు కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం శ్రీవాణిరెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి (శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు)

కుప్పం టౌన్ బ్యాంకుపై ఆంక్షలు తొలగింపు

కుప్పం : కుప్పం కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకులో గతంలో రిజర్వు బ్యాంకు విధించిన ఆంక్షలను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు మేనేజర్ శివక్రిష్ణ తెలిపారు. 2020లో టౌన్ బ్యాంకులో జరిగిన అవకతవకలపై రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా రుణాలు, షేర్ హోల్డర్లకు డివిడెంట్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకారం వడ్డీ ఇవ్వాలని ఆంక్షలు విధించింది. అప్పటి నుంచి టౌన్ బ్యాంకులో ఎలాంటి రుణాలు, షేర్ హోల్డర్లకు డివిడెంట్లు నిలిపివేశారు. ప్రస్తుతం ఆంక్షలు తొలగిస్తూ మార్చి 2025 నుంచి అన్ని విధాలా సేవలను పునరుద్ధరించాలని ఆర్బీఐ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజీనామా

చిత్తూరు అర్బన్ : చిత్తూరుకు చెందిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) వి.లోకనాథరెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో తాను ఈ పోస్టులో కొనసాగలేనని, మార్చి 1వ తేదీ నుంచి ఏపీపీగా విధులకు హాజరుకాలేనని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శికి తన రాజీనామా లేఖను పంపించారు.

క్రీడాకారులకు డీఈఓ అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న డీఈఓ

చిత్తూరు కలెక్టరేట్ : జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చాటిన జిల్లా సర్కారు పాఠశాల విద్యార్థులను డీఈఓ వరలక్ష్మి అభినందించారు. ఆ విద్యార్థులకు శనివారం డీఈఓ కార్యాలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ.. 2024–25 విద్యా సంవత్సరంలో జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో రాణించిన విద్యార్థుల ప్రతిభ అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తిని కొనసాగించి క్రీడల్లో మరింత రాణించాలన్నారు. అనంతరం జాతీయ స్థాయి క్రీడల్లో రాణించిన విద్యార్థులకు డీఈఓ సర్టిఫికెట్‌లు, పతకాలను అందించారు. ఈ కార్యక్రమంలో పీడీలు రవి, కృష్ణ, దాము, హరికృష్ణ పాల్గొన్నారు.

8న మహిళా సదస్సు

చిత్తూరు కలెక్టరేట్ : తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన మహిళా సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సమితి నిర్వాహకులు తులసీనాథం నాయుడు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పలమనేరులోని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కళా మందిరంలో మహిళా సదస్సు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. «సమాజాభివృద్ధి మహిళలు» అనే అంశంపై సదస్సు నిర్వహిస్తామన్నారు. సదస్సుతో పాటు వివిధ రంగాల్లో సేవలందిస్తున్న 25 మంది మహిళలకు ఉత్తమ మహిళా పురస్కారాలు అందిస్తామని వెల్లడించారు.


నీళ్లురాని కాలువకు నిధులు!

- హంద్రీ నీవా లైనింగ్ గుత్తేదారుపై ప్రేమతో నిధుల కేటాయింపు
- కాంట్రాక్టర్ల మేలు కోసమే బడ్జెట్ పెంచి పక్కా ప్లాన్

పలమనేరు : హంద్రీనీవా కాలువలో సాగునీరందిపచ్చటి పంటల కోసం ఇక్కడి రైతులు ఆశ పడుతుంటే ముందు లైనింగ్ పనులు జరిగి కాంట్రాక్టర్ బాగు పడితే చాలన్నట్టుంది ఈ బడ్జెట్ కేటాయింపులు. 2024–25 బడ్జెట్ (సవరణ)లో హంద్రీనీవా కోసం రూ.1586.14 కోట్లను కేటాయించిన కూటమి ప్రభుత్వం, 2025–26 బడ్జెట్‌లో మరో రూ.1657 కోట్లను పెంచి మొత్తం రూ.2,243.59 కోట్లుగా చూపింది. అయితే ఈ పెంచిన బడ్జెట్ ఇప్పుడు కాలువ లైనింగ్ పనులు దక్కించుకొని పనులు చేస్తున్న కాంట్రాక్టు సంస్థకు మేలు కోసమేనని అర్థమవుతోంది. దీంతో ఇక్కడి రైతుల ఆశలపై బడ్జెట్ నీళ్లు చల్లిందనే మాట సర్వత్రా వినిపిస్తోంది. జిల్లాలోని పడమటి ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఇక్కడి ప్రజలకు కల్పతరువనుకున్న హంద్రీ నీవా కాలువలో కృష్ణా జలాలు భవిష్యత్తులో రానట్టేనని తెలుస్తోంది. కృష్ణాజల వివాదాల ట్రిబ్యునల్–1 తీర్పు అమల్లో ఉన్నంత కాలం కృష్ణాలోని 811 టీఎంసీల నికర జలాలను ఏపీ, తెలంగాణ వాడుకొని ఆపై మిగులు జలాలు మాత్రమే హంద్రీ నీవా కాలువకు నీటిని విడుదల చేస్తామని బ్రిజేష్ కుమార్ ట్రిబునల్‌కు కూటమి ప్రభుత్వం స్పష్టంగా చెప్పింది. దీన్ని బట్టి చూస్తే రానున్న కాలంలో శ్రీశైలం ప్రాజెక్టు నుంచి హంద్రీ నీవాకు నీరు వచ్చే అవకాశమే లేదు. ప్రధాన కాలువకే నీరు రాకుంటే ఇందులో అంతర్భాగమైన పుంగనూరు ఉప కాలువ, కుప్పం ఉప కాలువలు అలంకార ప్రాయంగా మారడం ఖాయమనే మాట రైతుల్లో నెలకొంది.



కుప్పం ఉప కాలువలో భాగంగా నెర్నిపల్లి వద్ద జరుగుతున్న కాంక్రీట్ లైనింగ్ పనులు



పుంగనూరు బ్రాంచ్ కెనాల్ మ్యాప్

పీబీసీ, కేబీసీ లైనింగ్ పనులకే రూ.642 కోట్లు

హంద్రీ–నీవా సుజల స్రవంతి రెండో దశలో అంతర్భాగమైన పుంగనూరు బ్రాంచి కెనాల్ ప్రవాహ సామర్థ్యాన్ని 145 నుంచి 282 క్యూసెక్కులకు పెంచే లక్ష్యంగా కాంక్రీట్ లైనింగ్ పనుల కోసం రూ.480.22 కోట్లకు ఇప్పటికే పనులు మొదలయ్యాయి. ఇక కుప్పం బ్రాంచి కెనాల్ కాంక్రీట్ లైనింగ్ పనులు రూ.161.78 కోట్లతో పనులు చేపడుతున్నారు. ఈ రెండు చోట్ల పనులు చేస్తున్న కంపెనీలకే ఈ బడ్జెట్ నుంచి రూ.642 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పుడు కేటాయించిన బడ్జెట్ రూ.3,243 కోట్లలో కరెంట్ బకాయిలకు రూ.1000 కోట్లు పోతే మిగిలే రూ.2,243 కోట్లలో లైనింగ్ పనులకు రూ.642 కోట్లు పోగా రూ.1601 కోట్లు. దీంతో ఉమ్మడి జిల్లాకే రెండు వేల కోట్ల అవసరం ఉండగా పెండింగ్‌లోని పనులు, డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణం చేస్తేనే అడవిపల్లి, శ్రీనివాసపురం రిజర్వాయర్ల నిర్మాణం జరగని పరిస్థితి కనిపిస్తోంది. మొత్తానికి రైతులకు సాగునీరు అందిచకపోగా కాంట్రాక్ట్ కంపెనీలకు మేలు జరిగిన బడ్జెట్‌పై పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పుంగనూరు ఉపకాలువ

బోధన.. వేదన



కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ప్రతి విద్యార్థికి ఉన్నత విద్య ఎంతో కీలకం. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. ఫలితంగా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు అంధకారం నెలకొంటోంది. జిల్లా వ్యాప్తంగా ఎంతో చరిత్ర కలిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు నాక్ ఉత్తమ గ్రేడ్‌లను సాధిస్తున్నాయి. కానీ కళాశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించకపోవడం, అధ్యాపకుల కొరతతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు డిగ్రీ కళాశాలల వైపు విద్యార్థులు ఆస్తకి కనబరుస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు అధ్యాపకులు కరువు
- కోర్సులు ఫుల్.. అధ్యాపకులు నిల్
- ప్రభుత్వ కళాశాలల్లో తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- నాక్ గ్రేడ్‌లున్నా.. పట్టించుకోని వైనం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం సరైన చర్యలు చేపట్టడం లేదు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నత విద్యారంగంలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నాయి. గత ఐదేళ్ల పాటు వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు దీటుగా ప్రవేశాలు కల్పిస్తూ ఫ్యూచర్ రెడీనెస్ కాన్సెప్ట్ తో భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులను తీర్చిదిద్ది కొత్త ఒరవడిని సృష్టించారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అభివృద్ధిపై చిన్నచూపు చూస్తోంది. ఫలితంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు వెనుకబడిపోతున్నాయి.

అయిదేళ్లకు ముందు అందరికీ చిన్నచూపే..

వైఎస్సార్‌సీపీ సర్కారు అధికారంలోకి రాక ముందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలంటే అందరికీ చిన్నచూపే. పాతికేళ్ల కిందట ఒక వెలుగు వెలిగిన ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ఆ తర్వాత ప్రాభవం కోల్పోయి దైన్యస్థితికి చేరాయి. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన చంద్రబాబు డిగ్రీ కళాశాలల అభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో భవనాల మరమ్మతులు, సరైన సౌకర్యాలు లేని తరగతి గదులు, పనికిరాని లేబొరేటరీలు , తాగునీటి సమస్యలు, ముఖ్యమైన బోధనా అధ్యాపకుల కొరత వేధిస్తోంది.

కాంట్రాక్ట్ లెక్చరర్లే దిక్కు..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్టు, గెస్టు లెక్చరర్ల తోనే బోధన సాగిస్తున్నారు. ఇదే అదునుగా మార్చుకున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు నిష్ణాతులైన అధ్యాపకులను నియమించుకుంటున్నాయి. క్రమేణా ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఏటా విద్యార్థుల సంఖ్య క్రమేణా తగ్గిపోతోంది. రెగ్యులర్ పోస్టులు భర్తీ కాకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందని దుస్థితి నెలకొంది. ఉద్యోగోన్నతులు లేకపోవడం, కొత్త నియామకాలు లేకపోవడంతో ఏటా కాంట్రాక్టు, గెస్ట్ లెక్చరర్లను నియమించుకుంటూ కాలం వెల్లదీస్తున్నారు.

జిల్లా సమాచారం

జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు:	18
నాక్ ఏ ప్లస్ డిగ్రీ కళాశాలలు:	నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల చిత్తూరు పీవీకేఎన్ డిగ్రీ కళాశాల
ఉండాల్సిన రెగ్యులర్ అధ్యాపకులు:	1678
విధులు నిర్వహిస్తున్న అధ్యాపకులు:	748
భర్తీ చేయాల్సిన రెగ్యులర్ పోస్టులు:	930
విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు:	15,300

వేధిస్తున్న అధ్యాపకుల కొరత..

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకుల కొరత వేధిస్తోంది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీలు చేయకపోవడంతో కాంట్రాక్ట్, గెస్ట్ ఫ్యాకల్టీలతో కాలం నెట్టుకొస్తున్నారు.

- ఇటీవల నాక్ ఏ గ్రేడ్ వచ్చిన ఎంతో చరిత్ర కలిగిన పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 65 మంది రెగ్యులర్ అధ్యాపకులకు ప్రస్తుతం 18 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. మిగిలిన 47 పోస్టులు రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేయాల్సి ఉంది. అదే విదంగా నాన్‌టీచింగ్ స్టాఫ్ 53 మందికి గాను 23 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. 30 పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు.
- చిత్తూరులోని సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 35 మంది రెగ్యులర్ అధ్యాపకులకు గాను 16 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. మిగిలిన 29 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.
- నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏ ప్లస్ హోదా ఉంది. ఈ కళాశాలలో 34 మంది అధ్యాపకులకు గాను 21 మంది రెగ్యులర్‌గా ఉన్నారు. మిగిలిన 13 మంది కాంట్రాక్టు, గెస్ట్ విధానంలో విధులు నిర్వర్తిస్తున్నారు.
- గంగాధర నెల్లూరు నియోజకవర్గం కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బీ ప్లస్ ప్లస్ నాక్ హోదా ఉంది. ఈ కళాశాలలో 15 మంది అధ్యాపకులు ఉండాల్సి ఉండగా 6 మంది మాత్రమే రెగ్యులర్ విధానంలో విధులు నిర్వర్తిస్తున్నారు. మిగిలిన పోస్టులు రెగ్యులర్ విధానంలో భర్తీ చేయాల్సి ఉంది.



నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల


ప్రభుత్వ కళాశాలపై చిన్నచూపు తగదు



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో భర్తీ కాని పోస్టులను కూటమి ప్రభుత్వం వెంటనే భర్తీ చేసేలా చర్యలు చేపట్టాలి. ఎన్నో ఆశలతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పేద విద్యార్థులు ప్రవేశాలు పొందుతున్నారు. పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎంతో చరిత్ర ఉంది. ఈ కళాశాలలో అధిక సంఖ్యలో అధ్యాపకుల కొరత ఉంది. కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఏం చేస్తోందో తెలియజేయాలి.

– శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి

రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలి



జిల్లా వ్యాప్తంగా ఎంతో చరిత్ర కలిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలున్నాయి. అయితే వీటిలో రెగ్యులర్ అధ్యాపకుల కొరత వేధిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కళాశాలల్లో రెగ్యులర్ అధ్యాపకులను వెంటనే నియమించాలి. రెగ్యులర్ అధ్యాపకులు లేకపోతే పేద విద్యార్థులు ఎలా విద్యను కొనసాగించాలి. ప్రైవేట్ విద్యాసంస్థల్లో క్వాలిఫైడ్ లెక్చరర్‌లు ఉండడం వల్ల విద్యార్థులు ప్రైవేట్ వైపు మక్కువ చూపిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలి.

– పవన్, ఏబీవీపీ సంఘం చిత్తూరు బాగ్ కన్వీనర్

గురుకులాన్ని తనిఖీ చేసిన విజిలెన్స్



ప్రిన్సిపల్ పార్వతితో సమస్యలపై చర్చిస్తున్న మునీంద్రనాయక్, నాగేనాయక్

పుంగనూరు : పట్టణంలోని మేలుపట్లలోని ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలను శనివారం జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పరిశీలించారు. కమిటీ సభ్యులు డాక్టర్ బాణావత్ మునీంద్రనాయక్, నాగేనాయక్ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు ప్రిన్సిపల్ పార్వతితో చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ మునీంద్రనాయక్ మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత, పలు రకాల సమస్యలు ఉన్నాయని , వీటిని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సభ్యులు రామయ్యానాయక్, శ్రీరాములునాయక్, చిన్నరాయుడు, జిటినారాయణ, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీడీపీ ఎంపీటీసీ రాజీనామా



ఎంపీడీఓకు రాజీనామా పత్రాన్ని అందిస్తున్న టీడీపీ ఎంపీటీసీ లక్ష్మీనారాయణ

పలమనేరు: పలమనేరు మండలంలోని కొలమాసనపల్లి–2 ఎంపీటీసీ లక్ష్మీనారాయణ తన పదవికి రాజీనామా చేశారు. ఆ మేరకు స్థానిక ఎంపీడీఓ ఖాదర్‌బాషాకు తన రాజీనామా లేఖను శనివారం అందజేశారు. కూటమి రాజకీయాలు నచ్చక, ఆత్మాభిమానాన్ని చంపుకోలేక తాను పదవికి రాజీ నామా చేసినట్లు తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఆ పంచాయతీలో జరుగుతున్న కొన్ని సంఘటనలే రాజీనామాకు కారణమని తెలుస్తోంది.

నేటి సమాజానికి భారతీయ జ్ఞాన పరంపర అందాలి



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

తిరుపతి సిటీ : నేటి ఆధునిక సమాజానికి భారతీయ జ్ఞాన పరంపర అందించాలని, ఇందులో అధ్యాపకుల పాత్ర కీలకమని మహిళా వర్సిటీ వీసీ ఆచార్య ఉమ, జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. ఎస్పీయూ మాలవ్య మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ (ఎంఎంటీటీసీ)లో యూజీసీ సహకారంతో భారతీయ జ్ఞాన పరంపర – సమాజ పురోగతి అనే అంశంపై వారం రోజులుగా చేపట్టిన శిక్షణ శనివారం ముగిసింది. వారు మాట్లాడుతూ మన ప్రాచీన సంప్రదాయాలైన ఆయుర్వేదం, నీటి సంరక్షణ, పంటల సాగు, గురుకుల విద్య, సాంకేతిక స్థితి, ప్రాచీన విజ్ఞానం వంటివి ఆధునిక సమాజానికి అనుసంధానించాలన్నారు. అభివృద్ధి బాటలో తీసుకెళ్లేందుకు అధ్యాపకులకు ఈ శిక్షణ కార్యక్రమం ప్రధానమైందన్నారు. యూజీసీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ అనోల్ ఆండ్రే మాట్లాడుతూ ప్రాచీన భారత జ్ఞాన పరంపర పరిరక్షణ ఆధునిక సమాజంలో అనుసంధానించేందుకు కేంద్ర ప్రభుత్వం యూజీసీ ద్వారా శిక్షణ చేపట్టిందన్నారు. ఈ మిషన్ ద్వారా దేశవ్యాప్తంగా లక్ష మంది అధ్యాపకులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 100 మంది అధ్యాపకులు శిక్షణ తీసుకున్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 52,731 మంది స్వామిని దర్శించుకున్నారు. 17,664 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.24 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళితే లోనికి అనుమతించబోమని స్పష్టం చేసింది.

ట్రాఫిక్ పరీక్ష



పీసీఆర్ పరీక్ష కేంద్రం వద్ద రూం నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

ఇంటర్ విద్యార్థులకు సీఎం పర్యటన చుక్కలు చూపించింది. శనివారం ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. కాగా పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు కేంద్రాల వద్దకు చేరుకోవడానికి అష్టకష్టాలు పడ్డారు. ఇదే సమయంలో సీఎం పర్యటనకు సంబంధించిన వాహనాలు వందల సంఖ్యలో రావడంతో చిత్తూరు గాంధీ విగ్రహం నుంచి మురగానపల్లి వరకు భారీగా ట్రాఫిక్ ఏర్పడింది. దీంతో చాలా మంది విద్యార్థులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయారు. ఈ క్రమంలో కొంత మంది విద్యార్థులు పరీక్ష సమయానికి కేంద్రాలకు చేరుకోలేకపోయారు. మరికొంత మంది ఆలస్యంగా చేరుకొని అధికారులను బతిమాలుకొని కేంద్రాల్లోకి వెళ్లిన పరిస్థితి జిల్లా కేంద్రంలో కనిపించింది.

- ఇంటర్ విద్యార్థులకు ట్రాఫిక్ కష్టాలు రెట్టింపు
- సీఎం పర్యటనతో గందరగోళం
- చిత్తూరు గాంధీ విగ్రహం నుంచి మురగానపల్లి వరకు నిలిచిన వాహనాలు
- కేంద్రాల వద్దకు చేరుకునేందుకు విద్యార్థులు అగచాట్లు
- మొదటి రోజు పరీక్షకు 889 మంది గైర్హాజరు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా శనివారం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. జిల్లాలోని అన్ని మండలాల్లో 50 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. తొలిరోజు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం తెలుగు/హిందీ/సంస్కృతం/ఉర్దూ/తమిళం పరీక్షకు జనరల్ విద్యార్థులు 14,480 మందికి గాను 13,794 మంది హాజరు కాగా, 686 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 2,088 మందికి గాను



ట్రాఫిక్ సమస్యతో 9.20 గంటలకు సీకేపల్లి వద్ద ఉన్న శ్రీవివేకానంద కేంద్రం వద్దకు వచ్చిన విద్యార్థిని

1,885 మంది హాజరు కాగా 203 మంది గైర్హాజరైనట్లు ఇంటర్మీడియట్ అధికారులు వెల్లడించారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు. జిల్లాలో మొదటి రోజు జరిగిన పరీక్షలను డీవీఈవో సయ్యద్ మౌలా చిత్తూరులోని 4, సిట్టింగ్ స్క్వాడ్‌లు 5, ఫ్లయింగ్ స్క్వాడ్ 03, డీఈసీ మెంబర్‌లు 4, కన్వీనర్ 5, స్పెషల్ ఆఫీసర్ 4 పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు.

పరీక్షల సమయంలోనే పర్యటన

ఇంటర్మీడియట్ పరీక్షల సమయంలో సీఎం పర్యటన అవసరమా అంటూ పలువురు తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణ అన్ని శాఖల సమన్వయంతో సజావుగా నిర్వహించాల్సి ఉంటుంది. ఇలాంటి సమయంలో సీఎం పర్యటనలు ఉండడం వల్ల విద్యార్థులు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని తల్లిదండ్రులు చెబుతున్నారు. సీఎం పర్యటన వల్ల అధికంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో నగరంలోని సీకేపల్లి వద్ద ఉన్న శ్రీ వివేకానంద కళాశాల కేంద్రం వద్దకు ఒక విద్యార్థిని సెంటర్ తెలుసుకోకుండా వచ్చేశారు. ట్రాఫిక్ సమస్యతో ఆ విద్యార్థిని సీకేపల్లి వద్ద ఉన్న పరీక్ష కేంద్రానికి వచ్చిన సమయం ఉదయం 9.20 గంటలు. వచ్చిన పరీక్ష కేంద్రం సరైనది కాకపోవడంతో మళ్లీ అక్కడ నుంచి వెనుదిరిగి పీసీఆర్ పరీక్ష కేంద్రానికి వెళ్లింది. అప్పుడున్న ట్రాఫిక్ సమస్యకు 3 కి.మీ వరకు పీసీఆర్ పరీక్ష కేంద్రానికి ప్రయాణం చేయాల్సి వచ్చింది. అయితే ఆ విద్యార్థినిని మానవతా దృక్పథంతో అధికారులు పరీక్షకు అనుమతించారు. అయినప్పటికీ అర్ధగంట సమయం ఆ విద్యార్థినికి పరీక్ష సమయం వృథా అయింది. ఇదే విధంగా పలు పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు ఇబ్బందులకు లోనయ్యారు.

సీఎం పర్యటనతో అవస్థలు

జిల్లా కేంద్రంలో శనివారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షల విద్యార్థులకు ట్రాఫిక్ ఇక్కట్లు అధికమయ్యాయి. సీఎం చంద్రబాబు గంగాధర నెల్లూరు పర్యటనకు రావడంతో పలు వాహనాలు గాంధీ విగ్రహం నుంచి కొత్తబస్టాండ్, కొంగారెడ్డిపల్లి మీదుగా గంగాధర నెల్లూరుకు వెళ్లాయి. ఉదయం 8 గంటల నుంచి 9.30 గంటల వరకు సీఎం పర్యటనకు అధికంగా వాహనాలు వెళ్లడంతో కొంగారెడ్డి ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. ముందే కొంగారెడ్డిపల్లి వద్ద ఇరుకు రోడ్లు కావడంతో గంటకు పైగా వాహనాలు నిలిచిపోయాయి. గాంధీ విగ్రహం నుంచి ఇండస్ట్రీయల్ ఎస్టేట్ వరకు ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు పోలీసులు కరువయ్యారు. కొంగారెడ్డిపల్లి ప్రాంతంలోనే ఎక్కువ సంఖ్యలో పరీక్షా కేంద్రాలు ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



సీకేపల్లి ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రం వద్ద తనిఖీలు చేస్తున్న డీవీఈవో సయ్యద్‌మౌలా

పరీక్ష కేంద్రాల తికమక

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు పలువురు విద్యార్థులు పరీక్ష కేంద్రాలు తెలియక తికమకకు లోనయ్యారు. నగరంలో 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష కేంద్రాలు ఎక్కువగా కొంగారెడ్డిపల్లి ప్రాంతంలోనే ఉన్నాయి. మురగానపల్లిలో ఒకచోటే శ్రీవివేకానంద పేరుతో మూడు పరీక్ష కేంద్రాలు ఉండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తికమక పడ్డారు. పరీక్ష కేంద్రాల వివరాలను సరిగ్గా తెలియజేయకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడ్డారు. గతంలో ముందస్తుగా గూగుల్ రూట్ మ్యాప్‌లతో అవగాహన కల్పించేవారు. ఈసారి అలాంటి చర్యలు చేపట్టకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

- తిరుపతి జిల్లాకు చెందిన 84 మంది విద్యార్థులను నగరంలోని 12 కేంద్రాల్లో కేటాయించారు. వారందరూ కేంద్రాలు తెలియక ఆందోళనకు గురయ్యారు.

ప్రశాంతంగా పరీక్షలు

మొదటి సంవత్సరం పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపించాం. ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నాం. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కేంద్రాల్లో సౌకర్యాలు ఏర్పాట్లు చేశాం. పరీక్ష కేంద్రాలను సజావుగా నిర్వహించేందుకు పలు బృందాలు విస్తృతంగా జిల్లాలో పర్యటించడం జరిగింది.

– సయ్యద్ మౌలా, ఇంటర్మీడియట్ డీవీఈవో, చిత్తూరు

'నీ ఫ్రెండ్స్ వచ్చారు లేచి చూడరా నాన్న'

- మంచంపై నుంచి పడి పదో తరగతి విద్యార్థి మృతి



రియాజ్ మృతదేహం

పలమనేరు : 'రే నీ ఫ్రెండ్స్ వచ్చారు లేచి చూడరా నాన్నా' అంటూ బిడ్డ శవం వద్ద ఆ తల్లి ఆర్తనాదాలు అక్కడున్న వారిని కలిచివేశాయి. పలమనేరు పాతపేటకు చెందిన టెన్త్ విద్యార్థి శనివారం ఉదయం మంచం పైనుంచి కింద పడి తల వెనుక వైపు తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లగా కుటుంబీకులు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడు. పట్టణానికి చెందిన గౌషాబాషా కుమారుడు రియాజ్(15) పలమనేరులో ఓ ప్రైవేటు స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. శనివారం ఉదయం నిద్ర లేచే ముందు మంచంపై నుంచి కిందపడి అపస్మారక స్థితిలో ఉండడాన్ని తల్లి గమనించింది. దీంతో బిడ్డను పక్కనే ఉన్న ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లింది. పిల్లాడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో ఆ తల్లి పడిన వేదన అంతా ఇంతా కాదు. వారం రోజుల్లో పబ్లిక్ పరీక్షలను బాగా చదువుతున్న బిడ్డ ఇలా విగతజీవిగా మారడంపై ఆమె లబోదిబోమంది. ఏటా రంజాన్ మాసంలో ఉపవాసాలు సైతం ఉండే తన బిడ్డ రంజాన్ నెల ఆదివారం వస్తుందనే లోపే ఇలా తమను విడిచిపెట్టి వెళ్లాడని తలచుకుంటూ రోదించింది. కాగా బాలుడి తండ్రి దుబాయ్‌లో ఉంటున్నాడు. ఫోన్ ద్వారా విషయాన్ని ఆయనకు తెలిపారు. వీరికి ఎనిమిదో తరగతి చదివే కుమార్తె ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి పిల్లాడిని పోస్టుమార్టానికి తరలించి కేసు విచారిస్తున్నారు. స్కూల్‌లోగాని వీధిలో గాని మంచి పిల్లాడుగా పేరు తెచ్చుకున్న రియాజ్ లేడనే విషయాన్ని అక్కడివారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆ ప్రాంతంలో విషాదం అలుముకుంది.

మనవడిని చంపేశారు.. మనవరాలినైనా అప్పగించండి

- గ్రామస్తులతో కలిసి రోడ్డెక్కిన ఓ కుటుంబం

కార్వేటినగరం : మనవడిని చంపేశారు.. కనీసం తన మనవరాలినైనా మాకు అప్పగించాలని కొల్లాగుంట దళితవాడకు చెందిన కిరణ్ కుటుంబ సభ్యులు శనివారం రోడ్డెక్కారు. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు... కొల్లాగుంట దళితవాడకు చెందిన కిరణ్ తమిళనాడులోని పళ్లిపట్టు గ్రామానికి చెందిన నిషా కలసి పదేళ్ల కిందట కులాంతర వివాహం చేసుకున్నారు. వారికి సుస్మిత(8), మోటు(6) ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే నెల రోజుల కిందట ఇద్దరి పిల్లలతో కలసి నిషా మేల్‌మరవతూరు ఆలయానికి వెళ్లి అక్కడి నుంచి ఢిల్లీలోని తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయింది. దీంతో భార్య కావాలని పెద్దల సాయంతో ఎంత ప్రయత్నించినా ఆమె తిరిగీ రాలేదు. కాగా శనివారం కుమారుడు మోటు మృతి చెందినట్లు ఢిల్లీ నుంచి వీడియో కాల్ ద్వారా తెలియ జేయడంతో ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు, మా మనవడిని కావాలని వాళ్లే చంపేశారని, అదే విధంగా తన మనవరాలు



గ్రామస్తులతో కలిసి ఆందోళన చేస్తున్న బాధితులు

తమపై బెంగపెట్టుకుని ముఖం వాచిపోయి అనారోగ్యానికి గురైందని , మనవరాలినైనా తమకు అప్పగించాలని రోదిస్తూ గ్రామస్తులతో కలిసి కొల్లాగుంట దళితవాడ వద్ద చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై రాళ్లు, చెట్ల కొమ్మలను అడ్డంగా పెట్టి ఆందోళనకు దిగారు. తమ బిడ్డ మృతికి కారకులైన వారిని శిక్షించాలని భీష్మించి కూర్చున్నారు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి న్యాయం జరిగేలా చూస్తామని కుటుంబ సభ్యులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఆయన హెచ్‌ఎం.. ఆమె పెత్తనం

ఆయన హెచ్‌ఎం.. ఆరోగ్యం సరిగా ఉండదు.. తోడుగా స్కూల్‌కు భార్యను తెచ్చుకుంటాడు. మొదట్లో తన పని ఏదో తాను చేసుకుంటూ వెళ్లిన ఆమె.. మెల్లగా అజమాయిషీ చేయడం మొదలెట్టింది. ఆపై అన్నిటా పెత్తనం చేస్తూ వస్తోంది. అయితే ఏమైనా అనాలంటే హెచ్‌ఎం భార్య. ఏమీ అనలేని పరిస్థితి.. దీంతో తోటి ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు కూడా సరిగా చెప్పలేకపోతున్నారు. ఈ తంతు పలమనేరు పట్టణంలోని ఓ ప్రభుత్వ హైస్కూల్‌లో జరుగుతున్నా పట్టించుకునే నాథుడు లేరు.

- మధ్యాహ్న భోజనం నుంచి అన్నింటా ఆమె చెప్పిందే వినాలి
- స్కూల్ హెచ్‌ఎం భార్య కావడంతో అంతటా పెత్తనం
- ఎవరికీ చెప్పుకోలేక ఇబ్బంది పడుతున్న టీచర్లు, పిల్లలు
- పలమనేరులోని ప్రభుత్వ స్కూల్‌లో పూర్తిగా గాడితప్పిన పాలన

పలమనేరు: సాధారణంగా క్వాలిఫైడ్ ఉన్న వారే హైస్కూల్ హెచ్‌ఎంలుగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. కానీ ఆ హెచ్‌ఎం ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఆయన భార్య రంగంలోకి దిగారు. భర్తకు సాయంగా స్కూల్‌కు వస్తున్న ఆమె క్రమక్రమంగా బడిలో పెత్తనం చేయడం మొదలు పెట్టింది. ఇప్పుడు స్కూల్ మొత్తం ఆమె కంట్రోల్‌లోకి తీసుకోవడంతో టీచర్లు ఇబ్బంది పడుతున్న సంఘటన పలమనేరు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో తాజాగా వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. పలమనేరు పట్టణంలోని ప్రభుత్వ స్కూల్‌లో 3వ తరగతి నుంచి పదో తరగతి దాకా 724 మంది పిల్లలు చదువుకుంటున్నారు. గతంలో ఇదే పాఠశాలలో పీఈటీగా పనిచేసి ప్రమోషన్ పొంది ఇక్కడే హెచ్‌ఎంగా షంషీర్ ఏడాది కిందట బాధ్యతలు తీసుకున్నారు. అయితే ఇతని అనారోగ్య కారణాలతో భార్య స్కూల్‌కు తోడుగా రావడం మొదలు పెట్టింది. గత కొన్ని నెలలుగా స్కూల్‌లో హెచ్‌ఎం చేయాల్సిన కొన్ని పనులను ఈమె చేయడంతో పాటు తోటి సిబ్బందిపై అజమాయిషీ చేయడం మొదలు పెట్టినట్టు తెలిసింది. మధ్యాహ్న భోజనానికి బియ్యం, సరుకులు ఇవ్వడం, వారిపై పెత్తనం చెలాయించడం, పిల్లలను సైతం బెదిరించడం, టీచర్‌లాగా కుర్చీల్లో కూర్చోవడం లాంటి పనులు అక్కడ ఉన్న టీచర్లకు సైతం సహించలేదు. కానీ హెచ్‌ఎం భార్య గనుక వారు కూడా ఏమీ చేయలేక మనకెందుకులే అని పట్టించుకోలేదని తెలిసింది.



హైస్కూల్ టాయ్‌లెట్‌లో కనిపిస్తున్న మద్యం బాటిళ్లు

మద్యం బాటిళ్లు ఎలా వస్తున్నాయబ్బా ?

హెచ్‌ఎం భార్య విషయమై ఇప్పటికే ఎంఈఓ లీలా కుమారి దృష్టికెళ్లినా హైస్కూల్ హెచ్‌ఎంలపై తమకు సంబంధం లేదని పట్టించుకోలేదని తెలిసింది. ఇలా ఉండగా ఈ మధ్య బడిలోని బాలుర టాయ్‌లెట్లలో దాచిపెట్టిన మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. దీంతో అసలు బడిలో ఏం జరుగుతోంది ? ఎవరి కోసం మద్యం బాటిళ్లు తెచ్చారు ? వీటిని లోపలకు ఎవరు తీసుకొస్తున్నారని తల్లిదండ్రులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్‌రెడ్డిని వివరణ కోరగా తాను తనిఖీ చేసి దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముసుగు దొంగల హల్‌చల్

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలో ముసుగు ధరించిన నలుగురు దొంగలు దుర్గానగర్ కాలనీలో హల్‌చల్ చేశారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత దుర్గానగర్ ప్రాంతంలో నలుగురు వ్యక్తులు ముఖాలకు మంకీ క్యాప్, ముసుగులు ధరించి కాలనీలో సంచరించారు. ఓ ఇంటికి తాళం వేసి ఉండగా అక్కడ చోరీ చేయడానికి ప్రయత్నించారు. స్థానికులు కేకలు వేయడంతో దొంగల వద్ద ఉన్న క్యాటర్‌బాల్ (పిచ్చుకల్ని కొట్టే ఉండేలు)తో రాళ్లు పెట్టుకుని స్థానికులపై విసిరారు.ఈ నిందితులంతా హిందీలో మాట్లాడినట్లు, ఆయుధాలు కూడా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. అప్పటికే పోలీసు వాహనం గస్తీలో ఉండటంతో దొంగలు పారిపోయినట్లు తెలుస్తోంది. కాగా ఈ దృశ్యాలన్నీ ఓ ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు అయి.. సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఎక్కడైనా దొంగల సంచారం తెలిస్తే, పోలీసుల సాయం తీసుకోవాలని.. వెంటనే డయల్ 100, 112 నంబర్లతో పాటు వన్‌టౌన్ 9440796705, 9440796707, టూటౌన్ 9440796706, 9491074517 నంబర్లకు సమాచారం ఇవ్వాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ తెలిపారు.